క్లుప్తంగా

నేడు లింగంపల్లిలో బీరప్ప ఉత్సవాలు

మక్తల్: మండలంలోని లింగంపల్లిలో బీరప్ప బండారు ఉత్సవం సోమవారం ఉంటుందని గ్రామ కుర్వ కులస్తులు కుర్వాశప్ప, కింగిరి లింగప్ప, పూజరి లింగప్ప తెలిపారు. కుర్వ కులస్తులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐదేళ్లకు ఒక సారి నిర్వహించే కార్యక్రమమని తెలిపారు.

పశుగ్రాసం కోసం తిప్పలు



మరికల్: గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు పశుగ్రాసం కోసం తంటాలు పండుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. పశువులు ఉన్న రైతులు యాసంగిలో కోతలు వేసిన వరిగడ్డి కోసం దాదాపు 30 కిలోమీటర్ల దూరం వెళ్లి ఎకరా పశుగ్రాసంకు రూ. వెయ్యి నుంచి రూ.1500 వరకు చెల్లించి ట్రాక్టర్లపై తమ పొల్లాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ పశుగ్రాసం ఇంటికి చేరే వరకు రూ. 10 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు.

కల్తీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా: మండలంలోని పలు గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉండడంతో కర్ణాటక వ్యాపారులు కల్తీ పత్తి విత్తనాలను తెలంగాణలోకి వచ్చి తక్కువ ధరలకు విక్రయిస్తారని, అలాంటి వారితో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నవీద్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పత్తి విత్తనాలను ప్రభుత్వం సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని, కొన్న వాటికి రశీదు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలను ఎవరైనా విక్రయిస్తే రైతులు తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.

ప్రమాదకరంగా వంతెన



మాగనూర్: మండలంలోని నేరడగం సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై ఉన్న సైడ్ రెయిలింగ్ ఒకవైపు కూలిపోయింది. మరో వైపు బ్రిడ్జి మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయందోళన చెందుతున్నారు. ముఖ్యంగా లోలెవల్ వంతెన కావడంతో వర్షాకాలం ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరిమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

జింక పిల్లను కాపాడిన యువకులు



కృష్ణా: ప్రాజెక్టు కాల్వలో కృష్ణజింక నీటిలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉండగా కున్సి గ్రామానికి చెందిన రాము, బస్వరాజ్ అటు వైపు వెళ్తుండగా చూశారు. కాల్వలోని నీటిలోకి దిగి జింకను కాపాడి అడవిలోకి వదిలి వేశారు.

లయన్స్‌క్లబ్ కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ నారాయణపేట టౌన్ అధ్యక్షుడిగా లిఖి రఘు బాబు ఎన్నికయ్యారు. స్థానిక కృష్ణగోకులం పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఎన్నికల సమావేశానికి ముఖ్య అతిథులుగా క్లబ్ డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, గందెరవికాంత్, మధుసుధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024–25 గాను కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహేష్‌గౌడ్‌ను ప్రధాన కార్యదర్శిగా, సంజీవ్‌రెడ్డిని కోశాధికారిగా ఎంపికచేశారు. అనంతరం వారిని సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కృపాకర్ రెడ్డి, వెంకటేష్, రాముసింగ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అందుబాటులో రాయితీ విత్తనాలు

కోస్గి: ప్రభుత్వం రాయితీపై రైతులకు జీలుగ విత్తనాలు అందిస్తుందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చిరొట్టె ఎరువుల వాడకంతో వ్యవసాయ పొలాలు సారవంతమై పంటల దిగుబడి పెరుగుతుందని, రైతులు తమ పొలాల్లో పచ్చి రొట్టె ఎరువులను సాగు చేసుకొని భూములను సారవంతం చేసుకోవాలని తెలిపారు. 30 కిలోల బరువు ఉన్న జీలుగ బస్తా ధర రూ.2,790 కాగా రాయితీపై రూ.1,116 అమ్ముతున్నారని పేర్కొన్నారు. మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెరువు మట్టి.. చేనుకు మేలు



అమ్మపల్లి చెరువులో ఉపాధి కూలీలతో చేనులకు మట్టిని తరలిస్తున్న అధికారులు

- భూసారం పెరుగుదలకు దోహదం
- చెరువుల్లో పెరగనున్న నీటి నిల్వ
- ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని

మాగనూర్: చెరువు మట్టి చేనుకు మేలు చేస్తోంది. సాధారణంగా గతంలో ఎండకాలంలో నీరు ఎండిపోయినప్పుడు చెరువులో నుంచి మట్టిని తీసి పొలాల్లో వేసుకునే వారు. ఇప్పుడు ఈ పద్ధతిని చాలా తక్కువ మంది రైతులు పాటిస్తున్నారు. రైతులు తమ చేనులో మట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పుడు అనేక పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది.

పెరగనున్న నీటి నిల్వ..

వేసవిలో చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ పెరుగుతుంది. ఎక్కువగా నీరు నిలిచే అవకాశం ఉంటుంది. చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా నేల సారవంతం అవుతుంది. చెరువులో మట్టిలో ఎక్కువగా ఉండే పోషకాల వల్ల నత్రజని ఎక్కువగా అందుతుంది. అధిక దిగుబడి సాధించవచ్చు.

పుష్కలంగా నత్రజని, పొటాష్

చెరువు మట్టిని రైతులు పొలాల్లో వేసుకోవడంతో అనేక లాభాలున్నాయి. వివిధ పంటల మొక్కలకు అవసరమైన నత్రజని, పొటాష్, జింక్, మెగ్నీషియం పూడిక మట్టిలో పుష్కలంగా ఉంటాయి. నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుండగా, పొటాష్ తెగుళ్లను తట్టుకునే శక్తినిస్తుంది. చెలక భూములకు చెరువుమట్టితో రసాయన ఎరువుగా పనిచేస్తుంది. పూడిక మట్టితో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుండటంతో రైతులపై ఎరువుల కొనుగోలు భారం కొంతమేర తగ్గుతుంది.

అనేక ప్రయోజనాలు..

- రైతులు పండించే పంటలు అధిక దిగుబడులు వస్తాయి.
- చేనులో వేయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- నేలలో లవణాల గాఢత తగ్గుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని కూడా తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులకు కూడా ఎదుర్కొనే శక్తిని నేలకు ఉంటుంది.
- దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వస్తుంది.
- నేల సారవంతంగా మారుతుంది.

మట్టిని పొలంలో వేశాం



ఉపాధిహామి పథకం ద్వారా మండలంలో జోరుగా పూడిక తీత పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా మా గ్రామంలో మేము ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాం. మా యొక్క పంట పొలాలకు చెరువు మట్టిని వేయించుకుంటున్నాం.

– తాయప్ప, రైతు, అమ్మపల్లి

'ఉపాధి' ద్వారా లబ్ధి..



ప్రస్తుతం మా గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చెరువులో మట్టి పూడిక తీత పనులు నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా గ్రామంలోని కావాల్సిన రైతులు మట్టిని పంట పొలాలకు తరలించుకుంటున్నారు. దీని ద్వారా ఉపాధి కూలీలకు, రైతులకు లబ్ధి చేకూరుతుంది.

– నరేష్, సీనియర్ మేటి, అమ్మపల్లి

భూసారం పెరుగుతుంది



రైతులు వేసవి కాలంలో చెరువు పూడిక మట్టిని తమ పంట చేనులో వేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుంది. పంట మొక్కలకు మంచి ఏపుగా పెరిగి పంట దిగుబడి వస్తుంది. రైతులకు చెరువు మట్టి ఎంతో మేలు చేస్తుంది.

– హర్షవర్ధన్, ఇన్‌చార్జి ఏపీఓ, మాగనూర్

పల్లెప్రకృతివనం నిర్వహణ కరువు



జారుడు బండలో కింద తేలిన కంకర బెడ్డు

- విరిగిన ఆట వస్తువులు

ధన్వాడ: మండల కేంద్రంలో దాదాపు రూ.11 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం ప్రస్తుతం సరైన నిర్వహణ కరువైంది. ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని 2021లో చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటగా ధన్వాడలో ప్రారంభించారు. ఇందులో కేవలం ఆట వస్తువులకే రూ.3 నుంచి రూ.4 లక్షల ఖర్చు చేశారు. అలాగే పూల మొక్కల కోసం రూ. 2.40 లక్షలను వెచ్చించారు. నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం పూలమొక్కలు ఎండిపోయాయి. గతంలో ఎన్ఆర్‌జీఎస్ నుంచి కూలీని ఏర్పాటు చేసి నిర్వహణ అప్పజెప్పారు. వంద రోజులు పూర్తయ్యిందని ఆయనను తొలగించి పంచాయతీ సిబ్బందిని కేటాయించారు. పంచాయతీ, పల్లె ప్రకృతి వనం పనులు నిర్వహణ ఇబ్బందిగా మారింది.

ఆటలకు దూరం..

చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బల్ల, ఊయల, రింగుల రాట్నం విరిగిపోయాయి. అలాగే రెండేళ్లకే ఓపెన్‌జిమ్ వస్తువులు నిరుపయోగంగా మారాయి.

అసాంఘిక కార్యక్రమాలు

పల్లె ప్రకృతి వనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో పార్కును మూసి ఉంచుతున్నారు. దీంతో ఆ సమయంలో కొందరు యువకులు మద్యాన్ని సేవిస్తూ అల్లరి చేస్తుండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పార్కు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



విరిగిపోయిన ఊయల



ఎండిన పూల మొక్కలు

పైపులైన్‌కు మూతలు ఏర్పాటు



మక్తల్: పట్టణంలోని 8వ వార్డులోని ఆర్అండ్ఆర్ సెంటర్‌లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రాజాగౌడ్ తెలిపారు. పైపులైన్‌కు మూతలు లేక నీరు వృథాగా పోతుందని తెలిపారు. దీంతో చేసేది లేక తామే మూతలు తెచ్చి పైపులైన్‌కు ఏర్పాటు చేసుకున్నామని ఆయన చెప్పారు.

మాంసం దుకాణాలను తరలించండి

ఊట్కూరు: మండల కేంద్రంలోని ముగ్దుంపూర్ చౌరస్తాలో కొన్నేళ్లుగా కొనసాగిస్తున్న మాంసం దుకాణాలను తరలించాలని ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు కృష్ణయ్యగౌడ్, వెంకటస్వామి, నాగేష్, ఆనంద్ ఆదివారం కోరారు. సోమవారం నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. పంచాయతీ వారు నిర్మించిన దుకాణాలలో అమ్మకాలను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

క్రీడా సామగ్రి చోరీ

మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డిలో క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చిన క్రీడాసామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని క్రీడాప్రాంగణంలో వాటిని ఉంచగా, బిల్లులు రాకపోవడంతో కొంత వరకు పనులు చేసి వదిలేశారు. అంతలోపే సామగ్రిని ఎత్తుకెళ్లారని, అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



నవాబుపేట: కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన అనంతరం వచ్చిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తాజాగా గత మూడు రోజులుగా కురుస్తున్న వానలతో చాలా ధాన్యం తడిసిపోయిందని.. కాగా కేంద్రాల చెంత తేమశాతం ప్రకారం కొనుగోలు చేస్తున్న తరుణంలో తడిసిన ధాన్యం పరిస్థితేమింటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

మరుగున పడిన విద్యుద్దీకరణ పనులు

- పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం



ఎనిమిదో వార్డులో నిలిచిన విద్యుద్దీకరణ పనులు

అమరచింత: పట్టణంలో చేపడుతున్న విద్యుద్దీకరణ పనులు మరుగున పడ్డాయి. సుమారు రూ.18 లక్షలతో 4, 5, 6, 7లతో పాటు 8, 9వార్డుల్లో చేపడుతున్న విద్యుద్దీకరణ పనులు ఐదు నెలల నుంచి మరుగునపడ్డాయి. దీంతో పట్టణంలో విద్యుత్ సమస్య తీవ్రమవడంతో పాటు లోఓల్టేజీ సమస్య వేధిస్తుందని సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేకపోతున్నారు. పట్టణంలోని పది వార్డుల్లో గతంలో 40 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు ప్రస్తుతం దెబ్బతిని చిన్నగాలి వస్తే చాలు విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని, దశల వారీగా విద్యుద్దీకరణ పనులు చేపట్టడానికి మున్సిపల్ పాలకవర్గం తీర్మానంతో మొదటి విడతగా రూ.18 లక్షల నిధులతో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఏడాదైనా పనులు చేపట్టకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు సమన్వయంతో, మున్సిపల్ చైర్‌పర్సన్ చొరవతో ఐదు నెలల కిందట విద్యుత్ స్తంభాలు పాతారు. విద్యుత్ లైన్ అమర్చారు. 4, 5 వార్డుల్లో పనులు చేసిన కాంట్రాక్టర్ 6, 7 వార్డుల్లో స్తంభాలను పాతడం వరకే పనులు చేసి మిగిలిన పనులు అటకెక్కించాడు. అప్పటి నుంచి విద్యుద్దీకరణ పనులు మరుగున పడ్డాయి. ట్రాన్స్‌కో అధికారులు మాత్రం పనులు వేగవంతంగా పూర్తిచేస్తామని పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తామని చెప్పుకొస్తున్నారే తప్పా.. ఇప్పటి వరకు నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్ చేపట్టలేకపోతున్నారు.

పనులు పూర్తి చేస్తాం..



పట్టణంలో నిలిచిపోయిన విద్యుద్దీకరణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు ఎంత మేరకు బిల్లులు చెల్లించారో అనే విషయాలను ట్రాన్స్‌కో అధికారులతో తెలుసుకుని మిగిలిన పనులను పూర్తి చేయించేందుకు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి పూర్తిచేస్తాం.

– మంగమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్, అమరచింత

ఉద్యమకారుడి మృతికి నివాళి



అర్జున్‌రాజు (ఫైల్)

మక్తల్: పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఎస్పీ జిల్లా కార్యదర్శి అర్జున్‌రాజు(50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈయన మృతి చెందడంతో మండల ప్రజలు విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పలు పార్టీలకు చెందిన, సంఘాల నాయకులు నివాళులు అర్పించారు.

వరదనీరు మళ్లించే పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ కాల్వల ద్వారా వచ్చే వరదను పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) లోకి మళ్లించేందుకు న్యూటౌన్ వద్ద చేపట్టిన పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఇటీవల అక్కడ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జిని నిర్మించగా ప్రస్తుతం దాని కింద ఉన్న మట్టిని తొలగిస్తున్నారు. ఈ చెరువు చుట్టూ ఒకవైపు గతంలోనే తవ్విన కాల్వలో మురుగు, ఇక వర్షాలు కురిసినప్పుడు ఈ బ్రిడ్జి కింద నుంచి వరదను లోపలికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు రామయ్యబౌలి వద్ద గత ఏడాది ఇలాంటి ఏర్పాట్లే చేశారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ షేక్ ఉమర్ పాషా, ఎంఈ యు.బస్వరాజ్, డీఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరహరి పాల్గొన్నారు.

అలైటింగ్ ప్లాట్‌ఫాం ఎక్కడ?



దిగే వాళ్లను తోసుకుంటూ ఎక్కుతున్న ప్రయాణికులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అలైటింగ్ ప్లాట్‌ఫాం లేక ప్రయాణికులను ఎక్కడ పడితే అక్కడ ఇష్టారీతిగా దించేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి నారాయణపేట బస్టాండ్ ఆఖరి బస్టాప్ కావడంతో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో దిగుతుంటారు. అయితే మక్తల్, కోస్గి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నేరుగా ప్లాట్‌ఫాంల వద్దే ప్రయాణికులను దించుతుండటంతో బస్సు ఎక్కడానికి నిల్చుని ఉన్న ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై తోసుకుంటూ ఎక్కుతున్నారు. ఇక హైదరాబాద్ ప్రైవేట్ బస్సులతో పాటు యానగుంది, మహబూబ్‌నగర్ నుంచి వచ్చే బస్సులు బస్టాండ్‌లోని వెనకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో దించుతున్నారు. దీంతో అక్కడి నుంచి లగేజీలు పట్టుకుని మహిళలు, వృద్ధులు బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. అలైటింగ్ ప్లాట్ ఫాం లేక బస్సులు ఎక్కడ పడితే అక్కడ దించుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రత్యేకంగా అలైటింగ్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసి, అక్కడే బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మహబూబ్‌నగర్ బస్సులో ఎక్కడానికి ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



బస్టాండ్ వెనుక ఖాళీ స్థలంలో ప్రయాణికులను దించిన ప్రైవేట్‌బస్సు

ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుదాం



మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

నారాయణపేట రూరల్: లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక ఆలయ ఆవరణలో ఆదివారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక ఆదాయ, వ్యయాలను సరిచూశారు. అనంతరం నూతన కమిటి ఎన్నిక ప్రక్రియ చేపట్టగా గతంలోని కమిటీని యథావిధిగా 2024–25 ఏడాదికి కొనసాగిస్తున్నట్లు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని, శ్రావణమాసంతో పాటు జాతర సమయంలో అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, లప్ప అశోక్, రాధాకృష్ణ, కన్నజగదీష్, నర్సింహులు, చంద్రశేఖర్, బాలాజీ, ఆత్మారాం, సోమశేఖరస్వామి, రమాకాంత్, రాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్స్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

మరికల్: పట్టణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ మెకానిక్ కమిటీ ఆదివారం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శివాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా రవికుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సురారి, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, సలహదారులుగా చంద్రారెడ్డి, మల్లేష్, లంకల రాజు, శ్రీనివాసాచారి, ఆచారిని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి సంఘం కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన తమ సమస్యలను గుర్తించి అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్, ప్రమాదబీమాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మంజూర్ అహ్మద్, పాష, శ్రీను, లక్ష్మారెడ్డి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

నారాయణపేట: స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో సాధారణమైన జీవితం గడిపారని కొనియాడారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచారని తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో పార్లమెంటుకు మొదటి ప్రతిపక్ష నేత కామ్రేడ్ సుందరయ్య అని అన్నారు. పార్లమెంటుకు సైకిల్ మీద వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, బాల్‌రామ్, కాశప్ప, శివకుమార్, హనుమంతు పాల్గొన్నారు.

పూడుకుపోతున్న చెరువు కాల్వ



అమరచింత శివారులో చెరువుకు నీటిని తరలించే కాల్వ దుస్థితి ఇలా..

అమరచింత పెద్దచెరువును లిఫ్ట్ నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పంతో నిర్మించిన చెరువు కాల్వ నేడు పూడుకుపోతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ విఠల్‌రావు, ఎమ్మెల్యే స్వర్ణమ్మ నిధుల ద్వారా కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారం పథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వను నిర్మించుకోనున్నారు. అమరచింత రైతులు, అఖిలపక్ష నాయకులు, ప్రస్తుతం 12 సంవత్సరాలుగా లిఫ్ట్ నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలకపోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దింతో కాల్వలో బారీ చెట్లతో పాటు ముళ్లపొదలు నిండుకొని కాల్వను కమ్ముకున్నాయి. సాగునీటి కోసం ఖర్చుపెట్టిన సుమారు రూ.20 లక్షలు మట్టిలో కలిసిపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు.

అదుపు తప్పితే అంతే...



మూలమళ్ల -అమరచింత రహదారిలో కాల్వపై ఉన్న వంతెన దుస్థితి ఇలా..

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వపై నిర్మించిన వంతెనల పిట్టగోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయే అనే భయంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వంతెన దాటేస్తున్నారు. మండల పరిధిలోని అమరచింత నుంచి ములమళ్లకు వెళ్తున్న హదారిపై ఏడమ కాల్వ దాటేందుకు ఇరు గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన పిట్టగోడలు దెబ్బతినడంతో అవి విరిగి పడుతున్నాయి. వంతెనపై ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలపై వెళ్తున్న ప్రజలు వీటిని గమనించకుండా వెళ్తే.. కాల్వలో వారి వాహనాలు పడిపోనున్నాయి. ఇప్పటికైనా పీజేపీ అధికారులు స్పందించి వంతెన మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.